విస్తారంగా మిరప సాగు



సాగులో ఉన్న మిరప పంట

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా మిరప సాగు గత ఏడాదికంటే ఈ ఏడాది విస్తారంగా సాగుచేశారు. గత ఏడాదిలో సాగు తక్కువగా ఉన్నా మార్కెట్‌లో పచ్చి మిరప ధరలు అధికంగా ఉండటంతో రైతులకు లాభాలు తెచ్చిపెట్టాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మిరప సాగు ఎక్కువగా ఉన్నా ధరలు తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది 53 కిలోల బస్తా రూ.2500లు నుంచి రూ.4వేల వరకు ఉండేది. ఈ ఏడాది మార్కెట్‌లో రూ.1500లు నుంచి రూ.2వేలు మాత్రమే ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు. రైతులు నాలుగు నెలల పాటు సాగు చేసి పండించిన పంట ఏపుగా పెరిగినప్పటికీ ధరలు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చిమిరప ధర రూ.1800నుంచి రూ.2వేలు మాత్రమే ఉందని రైతులు అంటున్నారు. వచ్చే పది రోజుల్లో మార్కెట్లో మిరప ధరలు పెరిగితే బాగుంటుందని రైతులు ఆశిస్తున్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు ఈనెల 20 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో డీవీ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాలు అంతకంటే తక్కువ భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి అవకాశం వుందని తెలిపారు. మామిడి, చీనీ, సన్న నిమ్మ, సీతాఫలం, జామ, సపోట, కొబ్బరి, దానిమ్మ, నేరేడు, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలు నాటుకుంటే 3 సంవత్సరాల పాటు ప్రభుత్వం ద్వారా 100 శాతం ఉచితంగా నిర్వహణ చార్జీలు చెల్లించడం జరుగుతుందని తెలపారు. రోజా, మల్లె పూల తోటలు, మునగ తోట సాగు చేసిన రైతులకు రెండు సంవత్సరాల పాటు నిర్వహణా వ్యయం చెల్లించడం జరుగుతుందన్నారు. అదే విధంగా నర్సరీలు ఏర్పాటు చేసుకుని మొక్కలను పెంచి ఉపాధి హామీ పథకం కింద తోటలు సాగు చేసుకునే రైతులకు సరఫరా చేస్తే వారికి మూడు నెలల పాటు మొక్కలు పెంచిన చార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు ఉపాధి హామీ జాబ్ కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం, వన్ బీ, సన్న, చిన్న కారు రైతు పత్రం, జాబ్ కార్డులో పేరు వున్న వారి ఆధార్ కార్డు జిరాక్స్ ప త్రాలను తీసుకుని వచ్చి మండల ఉపాధి హామీ కా ర్యాలయంలో ఏపీవోను గానీ, గ్రామ స్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్‌ను గానీ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను గానీ సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో తెలిపారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే లక్ష్యం



నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు

వేంపల్లె : ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సేవాసంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బోర్డు సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ద్వారా ఎంతో మంది నిస్సహాయులకి చేయూత అందించామని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఉత్తమ సమాజ నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం సమాజ శ్రేయస్సు కోసం , సమాజంలోని నిస్సహాయులకు అండగా నిలుస్తున్న మానవత సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషం కలిగించిందన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ పూర్వపు అధ్యక్షుడు చల్లా బాలాజీ, కేంద్ర డైరెక్టర్ రాటాల గోపీ, వేంపల్లె శాఖ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ కావలి కృష్ణతేజ, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం ఆగదు



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మైలవరం : పూర్తిస్థాయిలో ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బొంతల నాయకుడు నాగరాజు స్పష్టం చేశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని వేపరాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ 29 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమం సాగుతోందని తెలిపారు. మాదిగల ఆత్మగౌరవానికి ఎమ్మార్పీఎస్ ప్రతీక అని వ్యాఖ్యానించారు. వర్గీకరణ కోసం గత ప్రభుత్వాలు అనేక కమిటీలు చేశాయని చెప్పారు. ఏ ప్రధాని కూడా వర్గీకరణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోలేదని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి పెంచాలని కోరారు. జెండా ఆవిష్కరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు బి.నాగన్న, బి. ఓబులేసు, ఓబయ్య, తిరుపాలు, లక్ష్మినారాయణ, ఎస్.సుబ్బరాయుడు, బి.కార్తీక్, పి.కుమార్, ఎం. పుల్లన్న పాల్గొన్నారు.

సుదీర్ఘ ఉద్యమాలు చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌దే

జమ్మలమడుగు : సుదీర్ఘ ప్రజా సమస్యలు, ఎస్సీవర్గీకరణ కోసం ఉద్యమాలు చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌కు దక్కుతుందని ఎంఈఎస్ జిల్లా అధ్యక్షుడు పిచ్చుకబాబు, ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి చిన్నయ్యలు తెలిపారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ అవిర్భావ దినోత్సవంతోపాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను పాత బస్టాండ్‌లో ఎగురవేశారు. కార్యక్రమంలో సైమన్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భావానికి 30 సంవత్సరాలు కావడంతో కడప జిల్లా ఎమ్మార్పీస్ అధ్యక్షుడు పిచ్చికే బాబు పెద్దపసుపుల గ్రామంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఒక ఎస్సీ వర్గానికే కాక ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర వర్గాల చైతన్యానికి ఎంతగానో దండోరా ఉద్యమం తోడ్పడిందని తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల రేంజిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై తనిఖీలు ముమ్మరం చేసినట్లు రేంజర్ రఘునాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి ఎర్రచందనంపై సీరియస్‌గా దృష్టి సారించడంతో డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందాలు ఏర్పడి రాత్రిల్లు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు టీమ్‌గా ఏర్పడి వాహనాలు తనిఖీ చేయడం, పాతముద్దాయిల కదలికలు, బెయిల్‌పై ఉన్న నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్ కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు. భక్తులు కానుకలను సమర్పించుకుని ఆలయ ఆవరణలో విందు భోజనాలు చేశారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



ఇంద్రజాల ప్రదర్శన నిర్వహిస్తున్న హరేరామ్ జాదుగర్

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. నంది అవార్డు గ్రహీత జాదుకళ రత్న ఇంద్రజాల మాంత్రికుడు హరేరామ్ జాదుగర్ ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. పరిపాలన అధికారి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

సీఆర్పీఎఫ్ జవాన్ మృతి



మునికుమార్‌రెడ్డి (ఫైల్)

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన రామిరెడ్డి మునికుమార్ రెడ్డి(40) సీర్పీఎఫ్ జవాన్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన మునికుమార్ రెడ్డి 2005లో సీఆర్పీఎఫ్‌లో చేరాడు. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో ఉండగా అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

వైఎస్సార్ జయంతికి తరలిరండి

పులివెందుల : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఉదయం 7.30 గంటలకు మోర్ సూపర్ మార్కెట్ సమీపంలో ఉన్న వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్ జయంతి సందర్భంగా మెడికల్ కళాశాలలోని ఆవరణలో రోగులకు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు.

పండ్లు పంపిణీ



చిన్నారులకు పండ్లను అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపల్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పులివెందులలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన నివాసంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి పుట్టినరోజు కూడా కావడంతో వైఎస్ మనోహర్‌రెడ్డి, హాలు గంగాధరరెడ్డిలు చిన్నారులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, జేసీయస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్లు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ ప్రసాద్, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంవీ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లింగాల : మండల ఎంఈఓగా పనిచేసి పదవి విరమణ పొందిన ఎంవీ నారాయణరెడ్డిని ఆదివారం మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పులివెందుల పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో ఆయన సన్మాన సభను ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ-2 రామకృష్ణయ్యలు నారాయణరెడ్డి సేవలను కొనియాడారు. పులివెందుల ఎంఈఓ రమణారెడ్డి, గండిక్షేత్ర ఈఓ ముకుందారెడ్డిలు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మండల ఉపాధ్యాయులు సత్కరించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన ద్వారా మూడు నెలల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశవులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ అకాడమిలో అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, జూనియర్ ఎక్స్ ఆపరేటర్, టైలరింగ్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్‌కు సంబంధించి ఆసక్తిగల వారు 10వ తరగతి పాసై 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 15వ తేదీలోపు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సర్టిఫికెట్లు, ఫొటోలతో న్యాక్ అకాడమిలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9985142155, 9885331972లను సంప్రదించాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సింహాద్రిపురం : మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు. అలాగే వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని, హాజరు కాని పక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేడు సర్వసభ్య సమావేశం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షకీలాబేగం శనివారం తన కార్యాలయంలో తెలిపారు.

కలవరమాయే మదిలో..

- ప్రారంభమైన ఆషాఢ మాసం
- కొత్త జంటలకు ఎడబాటు
- నెల రోజులు దూరం

కడప కల్చరల్ : ఆషాడం.. కొత్తగా పెళ్లయిన జంటలకు చిలిపి శత్రువు. పెళ్లయిన వారు జీవిత భాగస్వామి గురించి పూర్తిగా తెలుసుకోకముందే నెలరోజులపాటు వారిని దూరంగా ఉంచే మాసం. అప్పుడప్పుడే కొత్త జీవితంపై ఆశల పందిరిని అల్లుకునే సమయం. అత్తగారింటిని అర్థం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగే సమయం..ఆషాడ మాసం.

ఆషాడ మాసం వస్తోందంటే నూతన జంటల మదిలో కలవరం మొదలవుతుంది. నిజానికి ఈ మాసం పేరిట వధూవరుల మధ్య కలిగే ఎడబాటు వారిని మానసికంగా మరింత దగ్గర చేస్తుంది. ఒకరంటే మరొకరు తపించిపోయేలా మారుస్తుంది. ప్రకృతి శరీరాల మధ్య అవగాహనతో పెద్దలు ఆషాడం ఎడబాటును శాస్త్రీయంగా తప్పనిసరి చేశారు. నెలరోజులపాటు కొత్త జంటకు ఆషాడ విరహం తప్పదు. వివాహం ద్వారా భౌతికంగా, సామాజికంగా ఒకటి చేసిన సంప్రదాయాన్ని ఆషాడం మానసికంగా మరింత గట్టి పరుస్తుంది. అత్తాకోడళ్లు ఈ మాసంలో ఒకే ఇంటిలో ఉండకూడదని, ఒకరినొకరు ఎదురవ్వకూడదని పెద్దలు అంటారు.

ఎందుకంటే..

ఆషాడ మాసం మొదలయ్యే నాటికి వర్షాలు కురుస్తాయి. ఈ తొలకరిలో కొత్త నీరు వస్తుంది. మారుతున్న ఇలాంటి వాతావరణంలో అనుకూల, ప్రతికూల మార్పులను తట్టుకుని నిలవాలన్నదే ఆషాడంలోనే ఆంతర్యం. కొత్త జంటలలో అమ్మాయి ఈ మాసంలో అత్తగారింట్లో ఉండకూడదన్న సంప్రదాయం బాగా ప్రచారంలో ఉంది. శారీరకంగా, మానసికంగా అప్పుడప్పుడే భర్తకు దగ్గరవుతున్న కొత్త కోడళ్లు ఈ ఎడబాటు ద్వారా కలిగే ప్రేమ వారి భవిష్య జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందంటారు. ఈ మాసం నూతన జంటలను కొన్నాళ్లపాటు విడదీసి విరహంలో ముంచుతుందని భావించకుండా వారి మధ్య బంధాన్ని మరింతగా బలపరుస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి.

మాసమంతా విరహమే..

కానీ ఈ ఆధునిక కాలపు జంటకు నెలరోజులపాటు విరహం, బాధ ఉండదు. వివాహమైన నెలరోజులకే ఉద్యోగం చేసే చోట కొత్త కాపురం పెట్టేస్తుండడంతో అత్తాకోడలు ఒకే ఇంటిలో ఉండే నిబంధన వారికి వర్తించదు. దీంతో విరహంలోని తియ్యదనాన్ని నేటితరం జంటలు ఆస్వాదించే అవకాశం లేదు. నెలరోజుల తర్వాత అంటే శ్రావణమాసంలో మెట్టినింటివారు అమ్మాయికి చీర, సారె పెట్టి ఆశీర్వదించి మంగళ ప్రదంగా తమ ఇంటికి తీసుకు వస్తారు. ఇక్కడితో ఆషాడ మాసపు ఎడబాటు ముగుస్తుంది. ఈ ఏడాది జూలై 6న ప్రారంభమైన ఆషాడమాసం ఆగస్టు 4న ముగుస్తుంది. ఆషాడమాసమంతా హిందువులు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వివాహాలు తదితర శుభాకార్యాలు ఉండవుగనుక బంగారం కొనరు. నెలరోజుల తర్వాత శ్రావణమాసం రాగానే ఈ విరామానికి తెరపడుతుంది. ఆ తర్వాత రానున్న పండుగలు, వ్రతాలకు ఏర్పాట్లు చేసుకుంటూ సిద్ధమవుతారు.

ప్రకృతి పరంగా..

వైశాఖ జ్యేష్ఠ మాసాలు శుభ కార్యాలతో కళకళలాడతాయి. ఈనెల 6 నుంచి ఆషాడ మాసం ప్రారంభమైంది. తెలుగు సంవత్సరంలో నాల్గవ నెల ఆషాడమాసం. ఈ నెలలో పౌర్ణమిరోజు చంద్రుడు నక్షత్రాలకు దగ్గరగా వస్తాడు. సంక్రాంతి నుంచి ప్రారంభమైన ఉత్తరాయణాన్ని శుభకార్యాలు, పండుగలకు నెలవుగా పేర్కొంటారు. అందుకే ఈ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి పర్వదినంగా, పౌర్ణమిని గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటారు. ఆషాడంలో ఆధ్యాత్మిక వేత్తలు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. అనంతరం వచ్చే శ్రావణమాసంలో పండుగలు, వ్రతాలు ఉంటాయి. ఈ మాసంలోనే వర్షాలు ప్రారంభమై సూక్ష్మజీవులు పుడతాయని, కొత్త రోగాలను కలగజేసే ప్రమాదముందంటారు.